

పొగ మంచు కనువిందు

ప్రజాశక్తి -అనంతగిరి:తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా ఒక పక్క కుండపోత వానతో గెడ్డలు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా మరో పక్క పొగ మంచు అందాలు పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేశాయి. పాల సముద్రం వలే తలపించిన దృశ్యాలు శనివారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో తాటిపూడి జలశయం, విజయనగరం తో పాటు, అనంతగిరి ఎతైన కొండశివాఉలలో ఈ దృశాలు కను విందు చేశాయి. వీటిని కెమెరాల్లో పలువురు బంధించారు.


అనంతగిరి కొండలో పొగమంచు

ముంచుకొస్తున్న వరద ముప్పు


- భద్రాచలం వద్ద 35 అడుగులకు చేరిన గోదావరి
- మన్యంలో కుండపోత వర్షాలు
- పొంగుతున్న వాగులు వంకలు, నదులు



మారేడుమిల్లి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

అల్పపీడనం ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతంలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. వరద ముప్పు ముంచుకొస్తుండడంతో పోలవరం ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



గోదావరి నీటి మట్టం

చింతూరు : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చింతూరు మండలంలోని సోకిలేరు వాగు, చీకటి వాగు, చంద్రవంక వాగు, కొయ్యూరు వాగులు పొంగడంతో సుమారు 70 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోయ్‌గురు వాగు పొంగి ప్రవహించడంతో వరద ధాటికి 362 నెంబరు రహదారి సగానికి పైగా కోతకు గురైంది. దీంతో ఆంధ్ర -ఒరిస్సా మధ్య రవాణా స్తంభించిపోయింది. సోకులేరు వాగు ప్రమాద స్థాయిలో ప్రవహించడంతో చింతూరు, విఆర్.పురం రెండు మండలాలకు సంబంధాలు తెగిపోయాయి. 30 గ్రామాలకు పైగా రహదారులు మూసుకుపోయాయి. చింతూరు వద్ద శబరి నది ఉధృతంగా ప్రవహిస్తూ 22 అడుగులకు చేరింది. కూనవరం మండలంలోని గోదావరి ప్రవాహం 28.77 అడుగుల వద్ద పెరుగుతోంది. కూనవరంలో మొదటి ప్రమాద హెచ్చరిక 16.74 మీటర్లు ఉండగా డేంజర్ జోన్ 18.24 మీటర్లుగా ఉందని సిడబ్ల్యూసి లెక్కలు చెబుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి 35 అడుగులకు చేరుకుంది. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రాజవొమ్మంగి : మండలంలోని శుక్రవారం సాయంత్రం నుండి శనివారం ఉదయం వరకు ఎడ తెరపిలేని వర్షం కురవడంతో మడేరు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, లబ్బర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గింజర్తి వద్ద ఒట్టిగడ్డ వాగు, నెల్లిమెట్ల, లబ్బర్తి అనంతగిరి గ్రామాల మధ్య పెద్దేరు వాగులపై వరద నీరు పొంగి ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. వట్టిగడ్డ జలాశయంలో జలకల సంతరించుకుంది. ప్రమాదకర వాగుల వద్ద నుండి ప్రజలు ఎవరు రాకపోకలు సాగించరాదని రాజవొమ్మంగి సీఐ ఎస్ సన్యాసినాయుడు కోరారు.

ఎటపాక : గత మూడు రోజులుగా మండలంలో ఏకధాటిగా వర్షం కురుస్తుంది. చెరువులు, కుంటలు నిండుకుండల తయారయ్యాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మరో రెండు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు భయాందోళనతో ఉన్నారు. గోదావరికి వరద పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మారేడుమిల్లి : మండలంలో వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు గ్రామాలకు రాకపోలకు అంతరాయం ఏర్పాడింది. మారేడుమిల్లి నుంచి వై.రామవరం మండలం గుర్తేడుకు వెళ్లే ప్రధాన రహదారిలో బోడ్లంక గ్రామం వద్ద ఉన్న పెళ్లి రేవు వాగుకు వరద నీరు రహదారిపై నుంచి పొంగి ప్రవహిస్తుండడంతో ఆర్టీసీ బస్సు, ప్రైవేట్ వాహనాలు, ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో సున్నంపాడు సమీపంలో ఏకధాటి వర్షాలకు శనివారం ఉదయం భారీ వృక్షం రహదారిపై అడ్డంగా కూలింది. దీంతో ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మూడు గంటల అనంతరం స్థానికులు, ఆర్ అండ్ బి సిబ్బంది చెట్టును తొలగించడంతో రాకపోకలు సాగాయి.

కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి ఎద్దుమామిడి నుంచి గంపరాయి గ్రామాలకు వెళ్లే రహదారి మధ్యలో ఉన్న ఉల్లివాగు దగ్గర శనివారం ఉదయం కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. స్థానికులు అక్కడకు చేరుకుని కొండచరియలు తొలగించే ప్రయత్నం చేశారు. అలాగే కేడీపేట నుండి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారి పి.మాకవరం వద్ద వంతెన తెగిపోయి రాకపోకలు స్తంభించాయి. అధికారులు సత్వరమే కొట్టుకుపోయిన వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి చింతగుప్ప వాగు, దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు వాగు వరద నీరుతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేని వర్షాల వల్ల చింతపల్లి క్యాంప్, జిడిసి క్యాంప్‌ల్లో కాయగూరలు, ఆకుకూరలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో వరి నారు పొలాలు నీట మునిగాయి. వర్షాల వల్ల దారకొండలో మట్టిల్లు, సీలేరు 8వ క్లాస్ రోడ్డులో ఉన్న మసీదు ప్రహరీ గోడ కూలిపోయాయి. వంచుల పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి అరడ తెల్లన్న దొర ఇంటి గోడలు కూలిపోయింది. ఆ సమయంలో గదిలో ఎవరు నిద్రించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సీలేరుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఐస్ గెడ్డ సమీప ప్రధాన రహదారిపై రెండు భారీ వృక్షాలు శనివారం ఉదయం 7 గంటల సమయంలో కూలిపోయాయి. దీంతో రాకపోకలకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. అంబులెన్స్, ఆర్టీసీ బస్సులతో సహా పలు వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. స్థానిక పత్రికా విలేకరులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి జెసిబితో భారీ వృక్షాలను తొలగించారు. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట తరువాత రాకపోకలు పునరుద్ధరించారు.

జల దిగ్బంధంలో గిరిజన గ్రామాలు

పాడేరు : పాడేరు ఏజెన్సీలో గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలు మన్యాన్ని ముంచెత్తాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కాజ్వేలు కల్వర్టులు పైనుంచి వరద ప్రవహిస్తుండటంతో రవాణా స్తంభించింది. ప్రధాన రహదారిలో పలుచోట్ల చెట్ల కూలి రాకపోకలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు పాడేరు ఏజెన్సీ అంతట కుండపోతగా వర్షం కురిసింది. దీంతో, ఈ ప్రాంతంలోని మత్స్యగెడ్డ, రాళ్లగడ్డ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రవాహానికి లోతట్టు ప్రాంతాలన్నీ మునగడంతో పాడేరు, జిమాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు, జీకేవీధి తదితర మండలాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో ఇరుక్కున్నాయి.

ముంచింగిపుట్టు : మండలంలో తుఫాన్ ప్రభావంతో వాగులు, వంతెనలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వారపు సంతకు వచ్చే ఆదివాసి గిరిజనులు అనేక అవస్థలను ఎదుర్కొన్నారు. టైర్ ట్యూబులు, ఆనప డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు నడుముకు దిట్టంగా కట్టుకొని గెడ్డలు దాటి వారపు సంతకు గిరిజన ప్రజలు చేరుకున్నారు. మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం, బుంగపుట్టు పంచాయతీల పరిధి దోరాగుడా, బిర్రిగూడ, అత్తికాల్, కర్లపొదొర్, ముంతగుమ్మి, జర్రెల పొదోరు, నువ్వగూడ లతో పాటు సుమారు 50 గ్రామాల ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ స్పందిస్తూ లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో 3 వంతెనల నిర్మాణం చేపడుతున్న గుత్తేదారులు త్వరితగతిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. ఆంధ్ర- ఒరిస్సా సరిహద్దు ప్రాంతం కావడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి మార్మూల ప్రాంతాల కనెక్టివిటీ రోడ్ల పనులు వేగవంతం చేసి బ్రిడ్జిలు నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సర్పంచ్ కొర్ర త్రినాథ్ కోరారు.


ముంచంగిపుట్టు మండలంలో గెడ్డను దాటుతున్న గిరిజనులు

అరకులోయ రూరల్ : అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయితి యండపల్లివలస గ్రామంలో గంగమ్మ తల్లి గుడి సమీపంలో వర్షపు నీరు ప్రదాన రహదారిపైన నిలిచి పోవడంతో గ్రామస్తులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వర్షపు నీరు ఎటు వెళ్లడానికి వీలు లేక పోవడంతో రోడ్డుపై నిలిచియింది. అరకు నుండి పాడేరు వెళ్ళే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నీళ్ల రోడ్డుపై ఉండటంతో భయంగా రాకపోకలు సాగించారు. అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నీట మునిగిన పంట పొలాలు

దుంబ్రిగుడ : బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత నాలుగు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తుంది. శనివారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని గుంటగన్నెల పంచాయతీ డోమంగి గ్రామంలోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కితలంజి కాజ్ వే, పరిశీల రోడ్డు కోడిగడ్డ వంతెన పై వరద నీరు పొంగి ప్రవహించింది. దీంతో కితలంగి, కించుమండ పంచాయతీ గ్రామాల గిరిజనులకు రాకపోకలు స్తంభించి పోయాయి. చాపరాయి జలపాతం గేడ్డ పొంగి ప్రవహించడంతో పర్యాటకులకు అనుమతించలేదు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్ల లోపల వర్షపునీరు వెళ్లడంతో మండల కేంద్రంలో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.


హుకుంపేట : పాడేరు- అరుకు జాతీయ రహదారి బురదయంగా కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పెద్దగారువు స్కూల్ ఎదురుగా మాసాడ నూతన కల్వర్టు, బర్మగూడ కల్వర్టుల వద్ద బురద తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పెదబయలు : మారుమూల గిన్నెల కోట పంచాయతీ లండులు గ్రామ వంతెనపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో, పరిసర ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. పంట పొలాల్లో నీరు చేరుతుండటంతో దుక్కులకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.కిముడుపల్లి కుంతుర్ల గిన్నెలకోట లండులు వంతెనపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పెదబయలులో పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో డ్రైనేజి కోసం మట్టి తీసి అక్కడే వదిలి వేయడంతో రహదారి బురదమయంగా మారింది. దీంతో, పాదచారులు, ద్విచక్ర వాహనదారులూ అవస్థలాలు పడుతున్నారు.

హుకుంపేట : మండలంలోని హుకుంపేట సమీపంలో చిడిపుట్టు వంతెన మీదుగా నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. హుకుంపేట మండలం మూడు పంచాయతీలు, పాడేరు మండలం మోదపుటు పంచాయతీ వాసులు ఇదే రహదారి మీద రాకపోకలు సాగిస్తుంటారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు నిండిపోయి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.


కొయ్యూరు మండలంలో కోతకు గురైన రహదారి


పెదబయలు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు


జికె.వీధి మండలం సీలేరుకు సమీపంలో రోడ్డుపై కూలిన చెట్టు


గర్భిణులను పడవలో తీసుకెళ్తున్న దృశ్యం

నిండు గర్భిణిని కాలినడకన వాగు దాటించి ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -సీలేరు : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని కాలినడకన పొంగి ప్రవహిస్తున్న వాగు దాటించి ఆసుపత్రికి తరలించిన సంఘటన జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో శనివారం చోటుచేసుకుంది. దుప్పిలివాడ పంచాయతీ కోరపల్లి గ్రామానికి చెందిన కొర్ర లక్ష్మి పురిటి నొప్పులతో బాధపడుతుండగా, ఆశా వర్కర్ ఫోన్ ద్వారా సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె భవ్య ఆసుపత్రి సిఎస్ఆర్ అంబులెన్స్‌ను పంపించారు. ఈ గ్రామానికి వెళ్లే మార్గంలో రెండు భారీ వృక్షాలు కూలిపోవడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు రాకపోకలు పునరుద్ధరణ జరిగిన తరువాత అంబులెన్స్ వెళ్ల డి.అగ్రహారం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అంబులెన్స్ వెళితే ప్రమాదమని నిలుపుదల చేశారు. దీంతో గత్యంతరం లేక ప్రవహిస్తున్న వాగులో నుండే గర్భిణిని లక్ష్మి ఆశా కార్యకర్త, బంధువులు కాలినడకన వాగు దాటించి ఇవతల ఒడ్డుకు చేర్చారు. అక్కడ నుండి అంబులెన్స్‌లో దారకొండ పీహెచ్‌సీకి తరలించారు.

పడవలో గర్భిణులను ఆసుపత్రికి తరలింపు

చింతూరు : భారీ వర్షాల కారణంగా చింతూరు ఏజెన్సీలో కొండవాగులు పొంగిపోవడంతో మండల కేంద్రానికి మారుమూల గ్రామాలకు రహదారులు లేక గిరిజన గ్రామాలు జరదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ క్రమంలో కొండపల్లికి చెందిన ఇద్దరు గర్భిణులను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తన సిబ్బంది, ఏఎన్ఎంల సహాయంతో పడవలో వారిని వరద నుండి దాటించి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జిసిసి ఎమ్‌డిగా కల్పనా కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, పాడేరు : 2019 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన కల్పనా కుమారిని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ (జిసిసి) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జిసిసి ఎమ్‌డిగా పనిచేసిన సురేష్ కుమార్‌ను బదిలీ చేశారు. ఆయనను ఎక్కడకు వెళ్లనున్నారనేది ఇంకా స్పష్టత రాలేదు.




అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ గౌడ

అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎంజె.అభిషేక్ గౌడను ప్రభుత్వం నియమించింది. ఆయన 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ప్రస్తుతం విలేజ్ సెక్రటరీస్, వార్డ్ సెక్రటరీస్ అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పాడేరు సబ్ కలెక్టర్ దాత్రి రెడ్డి బదిలీ అయ్యారు. ఆమె ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లనున్నారు. జిల్లాలోని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కట్టా సింహాచలం నియమితులయ్యారు.

జిఒ 3ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:జిఒ 3ను పునరుద్దరణ చేయాలని మంత్రి నారా లోకేష్‌ని టి.ఎన్.ఎస్.ఎఫ్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు, అండిబ సర్పంచ్, తామర్ల సత్యనారాయణ కోరారు. శనివారం ఆయన పేర్కొన్నారు. విజయవాడ లోనీ ఉండవల్లిలో తన నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను కలిశానన్నారు. ప్రజాదర్బార్‌లో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పలు సమస్యలను విన్నవిం చానన్నారు. జీవో 117 రద్దు చేసి, ఏజెన్సీ ప్రాంతంలో1/70చట్టంను పటిష్టంగా అమలు చేయాలని, ఎంపీపీ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌కు కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. గిరిజనులకు నూటికి నూరు శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



లోకేష్‌ను కలిసిన సత్యనారాయణ

దుంబ్రిగుడలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

-పిహెచ్‌సి సిబ్బంది జీతాలు నిలుపుదల

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి వార్డులోని రోగుల బెడ్స్‌లను, పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. గర్భిణీలను వారం రోజులు ముందుగా ఆసుపత్రి తరలించి సురక్షిత ప్రసవాలను చేయాలని ఆదేశించారు. గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు మరణాలు జరిగితే సంబంధిత వైద్య సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పీహెచ్‌ఎన్ కు షోకజ్ నోటీసు అందించడంతో పాటు పి హెచ్ సి వైద్య సిబ్బంది జీతాలు నిలుపుదల చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం నంది వలస గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సందర్శించారు. విద్యార్థులు సరిగా చదవకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వార్డెన్ అంటే విద్యార్థులకు ఒక్క భోజన సౌకర్యం కల్పించడమే కాకుండా అవసరమైతే పాఠ్యాంశాలు కూడా బోధించే విధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయ ఉమ, తహసిల్దార్ హైమావతి, ఎంఈఓ ఎస్ సుందర్రావు, పి ఆర్ డి ఈ రామం, టిడబ్ల్యూ జేఈ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


మాట్లాడుతున్న జెసి

పునరావాస కేంద్రాలకు తరలించండి

- సంయుక్త జిల్లా కలెక్టర్ భావన వశిస్ట్

ప్రజాశక్తి-పాడేరు : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, గోదావరి, శభరి నదులకు రానున్న వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ భావన వశిస్ట్ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసి మాట్లాడుతూ, వరదలకు సంబంధించి మొదటి హెచ్చరిక రాగానే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అందుకు గ్రామ స్థాయిలో సర్పంచ్, ఎంపిటిసి, పంచాయత్ కార్యదర్శి, విఆర్ఓ, స్థానిక పెద్దలతో కమిటీగా ఏర్పడి భాదితులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ బృందాలు ఏర్పాటు చేసి సమాచార వ్యవస్థను మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రేడియో సెట్లు సిద్ధం చేయాలని, ట్రాక్టర్లు, బోట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా మండలాల ప్రజలకు ముందస్తు రేషన్ పంపిణీ చేయాలన్నారు. పశు మేత సిద్ధం చేయాలని, పంటలకు సంబంధిచిన సమాచారం సిద్ధం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొనారు.

28న మోద కొండమ్మ శాకాంబరి ఉత్సవం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి శాకాంబరి ఉత్సవం ఈ నెల 28న ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెల్లడించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆషాడ మాసంలో పాడేరు పట్టణంలోని అమ్మవారి ఆలయంలో మోదకొండమ్మ అమ్మవారి శాకంబరీ ఉత్సవం ఆనవాయితీగా నిర్వహిస్తున్న విధంగానే ఈసారి కూడా అతి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి ఆలయ ప్రాంగణాన్ని శాఖములతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సందర్శకులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

హాస్టళ్లలో సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-పాడేరు: -అఖిల భారత విద్యార్థి సమాఖ్య అద్వార్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యల పరిష్కారం దిశగా శనివారం నుండి 30 వ తేదీ వరకు అల్లూరి జిల్లాలో ఉన్న అన్ని ఆశ్రమ, గురుకులం హాస్టల్స్ సందర్శన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భం గా పాడేరు లో సి.ఎ.హెచ్. స్కూల్ హాస్టల్ నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి మాజీ ఏ ఐయస్ఎఫ్ నాయకుడు అమర్ పాల్గొని జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం 9 నెలల నుండి మెస్ చార్జీల బిల్లులని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం కాస్మొటిక్స్ ని ఇవ్వకుండా ఎగనామం పెట్టిందని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఏ.ఐ.యస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న హాస్టల్స్ అన్ని పది రోజులలో పర్యటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివ శంకర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న నేతలు



మెట్టజోరులో పరిశీలిస్తున్న అధికారులు

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో మెట్టుజోరు గ్రామంలో వరి, వేరుశనగ, రాగి, మొక్కజొన్న పంటలను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఎం.లీలావతి లు శనివారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, వేరుశెనగ పంటలో లద్దెపురుగు గమనించి వేపనునే పిచికారి చేయాలని రైతులకు సూచించారు.అధికంగా ఉన్న నీటిని తొలగించి ద్రవ జీవామృతం పిచికారి చేయాలన్నారు. వరిలో విత్తనశుద్ధి, కాలిబాటలు, సమగ్ర ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏహెచ్‌ఏ దీపా, ఎన్‌టిఈఓ మోహన్, ఏపీ సీఎన్ ఎఫ్ చిరంజీవి పాల్గొన్నారు.

పాడేరు:పాడేరు, జి.మాడుగుల మండలాలలో కె.కొడపల్లి, డి.గొందూరు వరి పొలాలను డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఎల్ ఆర్.బి.పాత్రుడు, వ్యవసాయ అధికారి ఎం.సూర్యనారాయణ నాయుడు, ఎఇఒ కె.జయంతి శనివారం సందర్శించారు. వరి నాట్లు వేసేటప్పుడు వరి నారు కట్టల చివరి భాగం తృంచడంతో కాండం తొలుచు పరుగు నుండి పైరు ను కాపాడుకోవచ్చు నని రైతులకు వివరించారు. పొలాల్లో ప్రతీ 5 మీటర్ల దూరంలో కాలిబాటలు ఉంచుకోవడంతో పైరుకు మంచి గాలి, వెలుతురు అందుతుందన్నారు. దీంతో చీడపీడలు ప్రభావం తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.వరి నాట్లు వేసేటప్పుడు మొనల మధ్య దూరం తగినట్లుగా ఉండాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నువ్వులు, కాయగూర పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విశాఖ జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు పివి.ప్రసాద్‌రావు పట్నాయక్ డిమాండ్‌చేశారు. శనివారం ఆనందపురం మండలంలోని ఎల్‌వి.పాలెం, బోని, ముకుందపురం, సిర్లపాలెం, బాకురుపాలెం తదితర గ్రామాల్లో ప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు, మీసాల రామునాయుడు పర్యటించి పొలాల్లో పంటలను పరిశీలించారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సిరిపురం కూడలిలోని చిల్డ్రన్స్ ఎరీనా ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంకు విశాఖపట్నం రీజియన్ రీజనల్ మేనేజర్ పిఎం.పదాన్ మాట్లాడుతూ బ్యాంకు స్థాపన దగ్గర నుంచి ఖాతాదారుల ఆదరణను చూరగొని దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా నిలిచిందని అన్నారు. అందరి అవసరాలకు తగ్గట్లు అన్ని రకాల రుణాలను అందిస్తోందని తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్యాంక్ రీజనల్ ఆఫీస్, ఇతర బ్రాంచిల్లో రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్‌ఐసి చీఫ్ రీజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ హాజరయ్యారు. పలువురు ఖాతాదారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఎమ్ సతీషా సాలుంకే, బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, నగరంలోని బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

వరదలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, దీనికి తోడు నదీ పరివాహక ప్రాంతాలలో ఎగువ నుండి నీరు వస్తున్నందున చింతూరు డివిజన్ ఫరిధిలో వరదలు వచ్చే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన సహాయ పునరావాస చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు, వరద ప్రభావిత మండలాల తహసిల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మొదటి హెచ్చరిక రాగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించటానికి బృందాలు రంగంలోకి దిగాలని, వారందరికీ అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విదంగా బోట్లను, ట్రాక్టర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. గర్భిణీలను, బాలింతలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రేషన్ సరుకులు ముందుగానే సరఫరా చేయాలని ఆదేశించారు. వసతి గృహాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వంటలకు అవసరమైన అన్ని సరుకులు సిద్ధం చేసుకోవాలన్నారు. వాగులు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున వాటికి ప్రత్యామ్నాయ రహదారులు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలు తలెత్తితే ముందుగా జనరేటర్లను, బోట్లు, గజ ఈతగాళ్లను, టార్పాలిన్లు సమకూర్చాలని సూచించారు. సెల్ టవర్ల సిగ్నల్స్ సరిగా వచ్చేలా చూడాలని జియో, ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్ ప్రతినిధులకు సూచిచారు.

ఘాట్ రోడ్లలో వాహనాలు నిషేధం

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఐదు ఘాట్ రోడ్లలో శనివారం నుండి భారీ వాహనాలు, బస్సులు, ప్రైవేటు జీపులు రవాణాను సాయంత్రం 7.00 నుండి ఉదయం 6 గంటల వరకు నిషేదిస్తూ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. ఇందులో భాగంగా వడ్డాది -పాడేరు ఘాట్ రోడ్, పాడేరు- చింతపల్లి కొక్కరాపల్లి ఘాట్ రోడ్, డౌనూరు -లంబసింగి, రంపచోడవరం - చింతూరు -మారేడుమిల్లి, ఎస్.కోట - అరకు అనంతగిరి రోడ్ మొదలగు ఐదు ఘాట్ రోడ్లలో ఈ నిషేద ఉత్తర్వులు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించండి

పాడేరు : దగ్గుతో బాధపడే వారిని గుర్తించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. క్షయ నివారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. శనివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడితే వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ల్యాబ్ టెక్నీషియన్లు క్షయ నిర్ధారణ పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. క్షయ నిర్ధారణ జరిగితే తక్షణమే వైద్య సహాయం అందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ జమాల్ బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హేమలత, సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు విశ్వామిత్ర పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి-యంత్రాంగం

సింహాచలం: భక్తుల హరినామ స్మరణతో శనివారం సాయంత్రం 4 గంటలకు సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు రథానికి జెండా ఊపి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. గిరిప్రదక్షిణ వేళ భక్తులు శనివారం వేకువజాము నుంచే తొలిపావంచ వద్ద కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి నెమ్మదిగా ప్రారంభమైన భక్తుల రాక మధ్యాహ్నం వర్షం ఆగిపోవడంతో లక్షలాదిగా తరలివచ్చి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. యువతీయువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు అనే తేడా లేకుండా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. రథం ముందు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వచ్ఛంద సేవా సంస్థలు, దేవస్థానం అధికారులు ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత ప్రసాద వితరణ, మంచినీటి సదుపాయాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటుచేశారు భక్తులు సేద తీరేందుకు గుడారాలను ఏర్పాటుచేసి కుర్చీలు వేశారు. జోడిగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానం చేసే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాలను అందుబాటులో ఉంచారు. కొండ చుట్టూ గట్టి పోలీసు భద్రతను ఏర్పాటుచేశారు. మరుగుదొడ్లను ఎక్కడికక్కడ ఏర్పాటుచేశారు. రథయాత్ర ప్రారంభమైన తర్వాత రెండో ఘాట్ రోడ్డు వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు.

అప్పుఘర్‌లో కలెక్టర్ పర్యటన

ఎంవిపి.కాలనీ : లక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణలో భాగంగా భక్తుల సౌకర్యార్థం అప్పుఘర్ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. శనివారం అక్కడకు వెళ్లిన ఆయన పరిస్థితిని సమీక్షించారు. కాసేపు ఉండి భక్తుల రాకపోకలను గమనించారు. అధిక సంఖ్యలో భక్తులు వస్తుండటంతో ఇన్ గేట్, అవుట్ గేట్ వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీతో క్యూలైన్ స్ట్రక్ అవ్వకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. అక్కడ పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్‌పి ర్యాంకు అధికారితో కలెక్టర్ కాసేపు మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని, భక్తుల తోపులాట జరగకుండా చూసుకోవాలని చెప్పారు. దుస్తులు మార్చుకునే గదుల వద్ద, స్నాన ఘట్టం పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, ప్రక్రియ సజావుగా, సులభంగా జరిగేలా జాగ్రత్త వహించాలని అక్కడున్న అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



గిరిప్రదక్షిణ రథాన్ని ప్రారంభిస్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

అనారోగ్యంతో విఒఎ మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని ఎగువశోభ పంచాయతీ శనివారం విఒఎ అనారోగ్యంతో మృతి చెందాడు. వెలుగు సంస్థలో విఒఎగా పాంగి శుభకరరావు (30) పని చేస్తున్నారు.అకాల మరణం పట్ల కుటుంబ సభ్యులు, గ్రూపు సంఘం సభ్యురాలు విలపించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై వాట్సాప్ చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మీ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సమస్యపై వాట్సాప్‌కు సమాచారం ఇవ్వాలని ఏపీఇ పీడీసీఎల్ నర్సీపట్నం డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యానందం తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఇందుకోసం వాట్సాప్ నెంబర్ కేటాయించారన్నారు. విద్యుత్ సమస్యలపై ఈ నెంబర్ కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యుత్ సమస్యలపై వాట్సాప్ నెంబర్ 7382249881 ఎస్ఈ (ఆపరేషన్స్) తెలియజేయాలని కోరారు. భారీవర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నర్సీపట్నం డివిజన్ కంట్రోల్ రూమ్ లో ఉన్న ఫోన్ నెంబర్ 9491030714కు సమాచారం తెలియచేయాలని వెల్లడించారు.

తాండవ కళకళ

ప్రజాశక్తి -నాతవరం: మండలంలో తాండవ రిజర్వాయర్‌కు వరద నీరు చేరుతుంది. గత సంవత్సరం సీజన్ అనంతరం భారీగా నీటిమట్టం పడిపోయింది. తాండవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా గత సంవత్సరం సీజన్ అనంతరం 355 అడుగులకు పడిపోవడంతో ఈ సంవత్సరం రైతులు పంటకు నీరు సరిపోతుందా అని చాలా ఆందోళన చెందారు. కురుస్తున్న వర్షాలు కారణంగా పెరుగుతున్న నీటిమట్టంతో రైతులలో ఆనందం చిగురించిది. ప్రస్తుతం నీటిమట్టం 366 అడుగులకు పెరిగింది. కురుస్తున్న వర్షాలకు మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు

ముంపు ప్రాంతాలు పరిశీలన

ప్రజాశక్తి -నాతవరం:తుఫాను సమయాల్లో వర్షాలు అధికంగా కురిసినప్పుడు మండలంలోని లోతట్టు గ్రామమైన వైబి అగ్రహారంను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జే.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ పరిశీలించారు. వైబి అగ్రహారం, కాకినాడ జిల్లా సరిహద్దు ఉప్పరి గూడెం వద్ద, తుని -నర్సీపట్నం ప్రధాన రహదారిలో ఉన్న వంతెనను పరిశీలించారు. వర్షాలు అధికంగా కురిస్తే తుని -నర్సీపట్నం రహదారిలో రవాణా సౌకర్యం వంతెన వద్ద కష్టంగా ఉండవచ్చని తెలియజేశారు వాతావరణం మార్పుల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. డ్రైనేజీలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైబిఅగ్రహారం గ్రామ సర్పంచ్ కోసూరు విజయ పాల్గొన్నారు

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్ పాసులు

ప్రజాశక్తి- రావికమతం :స్థానిక భవితా కేంద్రంలో 55 మంది విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఉచిత బస్ పాసులును మండల వికలాంగుల సంక్షేమ శాఖ అధ్యక్షులు ఏఆర్ జే.నర్సింగరావు, మేడివాడ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు, భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనకాపల్లి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించి, వారిలో 55 మంది దివ్యాంగులకు బస్సు పాసులు మంజూరు చేశారని, ఇవి మూడు సంవత్సరాల వరకు ఉచితంగా ప్రయాణం చేయడానికి పని చేస్తాయన్నారు. మండలంలో వున్న బుద్ధిమాంద్యం గల దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రి ఉచితంగా పొందడానికి జాతీయ సాధికారిక సంస్థకు 25 అప్లికేషన్ లు పంపించడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా 129 మందికి ఎస్కార్ అలవెన్స్, ట్రాన్స్పోర్ట్ అలవెన్స్, గర్ల్స్ స్టైఫండ్‌ల కింద మూడు లక్షలు 38వేలు జమ చేయడం జరిగిందని, తొమ్మిది, 10వ తరగతి చదువుతున్న 21 మంది దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్షిప్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ పరామర్శ

ప్రజాశక్తి-రోలుగుంటంమండల కేంద్రానికి చెందిన మడ్డు సత్యనారాయణ(గైరమ్మ సత్యం) ఇటీవల మరణించంతో ఆయన కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. గైరమ్మ సత్యం మరణం కుటుంబానికే కాకుండా వైసీపీకి తీవ్ర నష్టమని దర్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు.



గుట్టపై వేసుకున్న పాక

గుట్టలపై పాకలు వేసుకుంటున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- విఆర్.పురం : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 35 అడుగులకు చేరిన నేపథ్యంలో మండలంలోని గోదావరి పరివాహక గ్రామాలైన తుమ్మ లేరు పంచాయతీలోని నాలుగు గ్రామాలు, శ్రీరామగిరిలో నాలుగు గ్రామాల ప్రజలు గుట్టలపై పాకలు సిద్ధం చేసుకుంటున్నారు. మరో వైపు గోదావరి మరో ఐదు అడుగులు పెరిగితే విఆర్ పురం- వడ్డుగూడెం గ్రామాలకు రాకపోకలు బంద్ కానున్నాయి. ఈ నేపథ్యంలో వడ్డుగూడెం గ్రామస్తులు ముందస్తుగా రేఖపల్లి గ్రామంలో పునరవాస కేంద్రాలకు సామాన్లు ట్రాక్టర్లు, ఆటోలపై తరలిస్తున్నారు. తమకు బరకాలు, సోలార్ లైట్లు, మంచినీరు, బియ్యం, కిరోసిన్, ఇతర నిత్యవసర సరుకులు తక్షణమే అందించాలని వారు కోరుతున్నారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల అరెస్టు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం ఎఎస్పీ రాహుల్ మీనా విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఎఎస్‌పి కథనం ప్రకారం.... మడివి ఈరమయ్య, కూర రాజ్ కుమార్, ఉంగయ్య ముగ్గురు 2022 సంవత్సరంలో శబరి ఏరియా కమాండర్ గీత కమిటీలో మావోయిస్టు మిలీషియా సభ్యులగా చేరారు. మడివి ఈరమయ్యను మావోయిస్టు పార్టీ చుక్కల పాడు గ్రామ కమిటీ సభ్యుడుగా నియమించారు. 2024 జులై నెలలో చింతూరు మండలం మల్లంపేట గ్రామ శివారులో భద్రత బలగాలను హరత మార్చేందుకు మావోయిస్టులు వేసిన అంబుష్‌లో వీరు ముగ్గురు పాల్గొన్నారు. ఏడుగు రాళ్లపల్లి తునికాకు గోడౌన్ కూడా తగలబెట్టిన ఘటలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం గజేంద్ర కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, పోలీస్ స్టేషన్ 42 సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఏం రాధా తదితరులు పాల్గొన్నారు.

ఎటిడబ్ల్యుఒగా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, వై.రామవరం(లోయర్) మండలాలకు ఇన్‌చార్జి ఎటిడబ్ల్యుఒగా కె.కృష్ణమోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణమోహన్ పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో అయిన రంపచోడవరం ఏజెన్సీలో వార్డెన్‌గా, ఇన్చార్జ్ ఏటిడబ్ల్యూఒగా పని చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌ను ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, వార్డెన్లు అభినందించారు.

చురుగ్గా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి - కొయ్యూరు : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. చాలా చోట్ల వరి నాట్లు వేసేందుకు దమ్ము దుక్కిలు దున్నుతున్నారు. రానున్న రోజుల్లో కూడా వర్షాలు ఆశాజనకంగా ఉంటే పంటలు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పలువురు రైతులు అంటున్నారు. ఈ సంవత్సరం వరినాట్లు ఆలస్యంగా జరుగుతుందని, ఇంకా 15 రోజుల వరకు వరినాట్లు సాగుతాయని చెబుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని రత్నాపురం గ్రామానికి చెందిన మిడియం వీరమ్మ ఇల్లు బుధవారం అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో సామాగ్రి మొత్తం కాలిబూడిదైంది. ఇదే సమయంలో ఆ మరుసటి రోజు ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో వీరమ్మ కుడికాలు విరిగిపోయింది. కష్టాల్లో ఉన్న వీరమ్మను ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ శనివారం పరామర్శించి, పది కేజీల బియ్యం, ఉప్పు, పప్పు, కారం తదితర నిత్యావసర సరుకులు, రూ.2వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో జెకెసిటి సభ్యులు రియాజ్, నటరాజ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు గ్రామాల్లో..

ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-చింతూరు : వర్షాలకు నదులు, వాగులు ఉధృతంగా పొంగడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ముంపు గ్రామాల ప్రజలకు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలలోని కూగురు, చుటూరు తదితర ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని ముంపు గ్రామ పంచాయతీలైన ఎజి కోడేరు, చింతూరు, ముకునూరు, కుమ్మూరు, కల్లేరు, చిడుమూరు, చట్టి గ్రామాల ప్రజానీకానికి నిత్యావసర వస్తువులను, మంచినీటి అందుబాటులో ఉంచాలని స్థానిక తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. కళ్లేరు జాతీయ రహదారి మరమతులు చేపట్టలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు యర్రంశెట్టి, శ్రీనివాస్, పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

వరద ముప్పు గ్రామాల్లో సిపిఎం నాయకుల పర్యటన

విఆర్.పురం : మండలంలోని కోటార్ గొమ్ము, జీడిగుప్ప, ములకపల్లి తదితర ముంపు గ్రామాలను సిపిఎం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ పది రోజుల నుండి వర్షాలు పడుతున్నా బాధితులకు బియ్యం తప్ప ఇతర నిత్యవసర సరుకులు, బరకాలు, కిరోసిన్ ఇవ్వలేదని తెలిపారు. బియ్యం కూడా పది కిలోమీటర్లు ఆటో మీద వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి పెరగటంతో ఆదివారం నాటికి రహదారులు బంద్ అవుతాయని, తక్షణమే బాధితులకు సరుకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, తాతబాబు రెడ్డి, ప్రకాష్‌రావు, వాళ్ల కృష్ణారెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న సిపిఎం విఆర్.పురం మండల నాయకులు

రేఖపల్లిలో పునరావాసానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని గోదావరి, శబరి వరద ప్రభావిత గ్రామాలైన ధర్మతాల గూడెం, వడ్డిగూడెం, విఆర్ పురం గ్రామ ప్రజల కోసం రేఖపల్లి గ్రామంలో పునరవాసానికి ఆ పంచాయతీ సర్పంచ్ పూనెం సరోజిని ఆధ్వర్యాన ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కెజివిబి, గొల్లగూడెం ప్రాంతాల్లో శనివారం దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పునరవాస కేంద్రాలకు వచ్చే వారికి ఎలాంటి అనారోగ్యం గురికాకుండా ఈ సీజన్లో వచ్చే వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, పంచాయతీ కార్యాదర్శి, ఏఎన్ఎం, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు, బాలింతలు, వ్యాధిగ్రస్తులు

ప్రజాశక్తి-చింతూరు : జిల్లా కలెక్టర్, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు గోదావరి, శబరి వరదల సందర్భంగా ముంపు గ్రామాలలో ఉన్న గర్భిణీలు, బాలింతలు, ఇతర దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి ముందుగా ఎంపిక చేయబడిన ప్రదేశాలకు తరలించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వీరిని డివిజన్లోని చింతూరు ఏరియా హాస్పిటల్, కూనవరం, ఏడుగురాళ్లపల్లి, తులసిపాక ఆసుపత్రులు, ఆశ్రమ పాఠశాలలకు తరలించడం జరుగుతుంది. ఇప్పటి వరకు కోతులుగుట్ట హాస్పిటల్‌కి 15 మందిని, చింతూరు హాస్పిటల్‌కి 28 మందిని తరలించడం జరిగింది. ఇప్పటివరకు ముంపు పరిధిలోకి వచ్చే గ్రామాలలో 227 మంది గర్భిణీ స్త్రీలను గుర్తించడం జరిగింది. వారందరినీ వరద పరిస్థితిని బట్టి ముందుగానే తరలించడం జరుగుతుంది. నొప్పులతో బాధపడుచున్న గర్భిణీలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాన్పులు చేయనున్నారు. వీరికి భోజనం, వసతి సౌకర్యం అందించడం జరుగుతుంది.

జివిఎంసి కమిషనర్‌గా సంపత్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కమిషనర్‌గా 2016 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన పి.సంపత్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సంపత్ కుమార్ ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తూ విశాఖకు బదిలీ అయ్యారు.

భూపతిపాలెం రిజర్వాయర్ నుంచి 700 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-రంపచోడవరం

భారీ వర్షాలకు రంపచోడవరం మండలంలోని వాగుల నుండి భూపతిపాలెం రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఇరిగేషన్ అధికారులు సుమారు 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మండలంలోని సత్తుపల్లి పాత గ్రామంలో వరద పరిస్థితిని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్లు పరిశీలించారు. అనంతరం నిన్న సీతపల్లి గల్లంతైన వ్యక్తి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

ఎవిపి డ్యామ్ నుండి 1000 క్యూసెక్కులు

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి అలిమేరి వాగు పికప్ డ్యాం (ఏవిపి డ్యాం)కు వరద నీరు పోటెత్తడంతో శనివారం 2 గేట్లు ఎత్తి 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ టి.విజయ్ కుమార్ వెల్లడించారు.

స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలనుంచి వరద నీరు ఏవీపీ డ్యాంలో ఇన్ఫో 4,500 క్యూసెక్కులు చేరిందని తెలిపారు. దీంతో రెండు గేట్లు ద్వారా వెయ్యి క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.



కూరుకుపోయిన లారీ ఇదే..

డైవర్షన్ రహదారిలో కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కొండపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 516ఈ నిర్మాణ జరుగుతున్న ప్రాంతాలో డైవర్షన్ రహదారిలో శనివారం టిప్పర్ లారీ కూరుకుపోయింది. దీంతో సుమారు 5 గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతేడాది సెప్టెంబర్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టినా నేటికీ పూర్తి కాకపోవడంతో ఈ మార్గంలో ఏదో ఒక చోట లారీలు, ఇతర వాహనాలు బోల్తా పడటం, బురదలో కూరుకుపోవడం, ద్విచక్ర వాహనాలు ప్రమాదాలు జరగడం వంటి సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతన రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్ధరాత్రి బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు : భద్రాచలం నుండి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జికె.వీధి మండలం ఆర్‌వి.నగర్ ప్రధాన రహదారి పక్కన బురదలో కూరుకుపోయింది. దీంతో ప్రయాణికులు కారడవిలో, జోరువానలో బిక్కుబిక్కుమంటూ రాత్రంతా కాలం వెళ్ళదీశారు. బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు చలితో వణికిపోయారు. శనివారం ఉదయం డ్రైవర్లు సొంత డబ్బులు రూ.2000 వెచ్చించి సమీపంలో ఉన్న జెసిపిని తీసుకొచ్చి బురదలో కూరుకుపోయిన బస్సును బయటకు తీశారు. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా విశాఖపట్నం తరలించారు.

ఘనంగా ఎమ్మెల్యే శిరీషాదేవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి పుట్టినరోజు వేడుకలు రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో తెలుగుదేశం శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గణజాల తాతారావ్, వాసంశెట్టి గంగాధర్, బొరంగి అనుదీప్, చెక్కా పండుబాబు, కోపూరి రత్నం, పులిమెట్ల వెంకటరమణ, ఎలిశెట్టి అప్పలరాజు, తెడ్ల రాంబాబు, సాగిన చిన్నమ్ములు, కంటపురెడ్డి వీరబాబు, గణజాల మల్లిఖార్జున్, మార్బిడి రామచక్రి, తెడ్ల శ్రీకాంత్, జనసేన నాయకులు పోకల మల్లిబాబు, కాకర చినబాబు, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : ఎమ్మెల్యే శిరీషాదేవి జన్మదిన వేడుకలు అడ్డతీగలలో ఎన్డీయే కూటమి నాయకులు శనివారం నిర్వహించారు. అడ్డతీగల సీతపల్లి కూడలిలో కేకు కట్ చశారు. అనంతరం అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నడిగట్ల రమేష్ బాబు, జె.వెంకట రమణారెడ్డి, కింతాడ నానిబాబు, ఎస్ రాజా, తొట్ట ప్రసాద్, బేలెం సత్యనారాయణ, బి.వీరారెడ్డి, కే.వీరబాబు, జి.వీరబాబు, వైద్యులు పండా సతీష్ పాల్గొన్నారు.

అన్నవరం బ్రిడ్జి వద్ద మరమ్మతులు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని అన్నవరం- ఉమ్మడివరం వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ బ్రిడ్జి వరద తాకిడికి ఒక పక్క కొట్టుకుపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఆర్ అండ్ బి అధికారులు, తహశీల్దారు, పోలీసులు బ్రిడ్జి కింద మరమ్మతు పనులు చేపట్టారు.

సీలేరు నదిలో వలలకు చిక్కిన చేపలు

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు నదిలో చేపలు విరివిగా మత్స్యకారులకు లభ్యమవుతున్నాయి. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు నుంచి వరద నీరు సీలేరు నదులు చేరుతుంది. కొత్తనీరు నదిలో చేరడంతో చేపలు వ్యర్థ పదాలు తినేందుకు పైకి రావడంతో కేజీ నుంచి 8 కిలోల వరకు అరుదైన మిలట్రీ మేసు, రవ్వ జాతికి చెందిన చేపలు మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి.